# మధురం మధురం ఈ ప్రణయం!

*ఆంధ్రభూమి వీక్లీ.. 6 డిసెంబర్, 2001*



కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేసుకుంటున్న కిరణ్ దగ్గరికి వచ్చింది స్వప్న.

“హలో... ఐ థింక్ యు ఆర్ మిస్టర్ కిరణ్?!”

“యస్..!” అంటూ కంప్యూటర్ ఆఫ్‌చేసి, ఆమెవైపు తిరిగి, “హలో...” అన్నాడు పలకరింపుగా.

“నా పేరు స్వప్న! గురువారం రిపోర్టు చేశాను.”

“తెలుసు. మీకిదే మొదటి అపాయింట్‌మెంట్. మొదటి బ్రాంచి. మీ నాన్నగారి పేరు విశ్వనాథరావు.., మీ క్వాలిఫికేషన్ బి.ఎస్సీ.., మీ పుట్టినతేదీ సెప్టెంబర్ రెండు, పంతొమ్మిది

పందల డెబ్భై ఎనిమిది! మీ ఎడమ బుగ్గపైన దిష్టిచుక్కలా ఓ పుట్టుమచ్చ! ఇంకో పుట్టుమచ్చ..." అని ఆలోచిస్తున్నట్లు ఆగాడు.

"చాలు చాలు..!" కంగారుగా అంది స్వప్న.

"అయినా... ఇన్ని విషయాలు మీకెలా తెలిశాయి?"

"మీ సర్వీసు ఫైలు నా దగ్గరే వుంది కనుక!"

"అలాగా..? నేను చేరిన ఈ మూడురోజుల్లో స్టాఫ్ అందరూ మీ గురించే చెప్పారు. మీరు మంచి వర్కర్ అనీ, పంక్చువల్ అనీ, సిన్సియర్ అనీ... చాలా చెప్పారు. అప్పట్నుంచీ మిమ్మల్ని కలవాలని ఎదురుచూస్తున్నాను. మీరు లీవులో ఉన్నట్లున్నారు!"

"మరేమనుకున్నారు? దటీజ్ కిరణ్..!" కాలరెగరేస్తూ, గర్వం నటిస్తూ అన్నాడు.

"చూస్తూండండి... ఇంకో మూడునెలల్లో మీకంటే బాగా పనిచేసి, మీకంటే మంచిపేరు తెచ్చుకుంటాను. ఇట్స్ మై ఛాలెంజ్..!" బొటనవ్రేలిని చూపిస్తూ 'థమ్సప్' స్టైల్లో అంది.

"వెరీగుడ్! ఈ బ్రాంచిలో ప్రతి ఒక్కరూ నాలా పనిచేయాలనే నేను కోరుకుంటాను. బ్రాంచిలోని వందమందీ బాగా పనిచేస్తే ఆర్గనైజేషన్‌కి లాభాలు పెరుగుతాయి. మనకు బెనిఫిట్స్ పెరుగుతాయి. మన 'స్టాండర్డ్ ఆఫ్ లివింగ్' పెరుగుతుంది. కనుక మీరు బాగా పనిచేసి మంచిపేరు తెచ్చుకోవడం నాకూ లాభదాయకమే..!"

అతని మాటలు వింటూ నిలబడిపోయింది స్వప్న.

'ఇతను చక్కగా మాట్లాడగలడు!' ...అనుకుంది.

"హలో... నిలబడి కలల్లో కెళితే మంచిపేరు రాదు. సీట్లో కూర్చుని పనిచేస్తే వస్తుంది!" అన్నాడు.

"యూ..." అంటూ అతని వైపు కోపంగా చూసి, "ఓ.కే... మళ్లీ కలుద్దాం!" అంటూ తన సీటుకు వెళ్లిపోయింది స్వప్న.

లంచ్ టైంలో టిఫిన్ తింటున్న స్వప్న ఎదురుగా కూర్చున్నాడు కిరణ్.

తన క్యారియర్ విప్పుతూ-

"ఎలావుంది బ్రాంచి?" అని అడిగాడు.

"చాలాబాగుంది. అందరూ బాగా మాట్లాడేవారే!"

"ఎంతమంది పిల్లలు మీకు?" కొంతసేపు తర్వాత స్వప్న అడిగింది.

"ఇద్దరు!"

"ఏం చదువుతున్నారు?"

"నిండు జీవితం చదివారు!"

"అంటే..?" అర్థంకానట్లు చూస్తూ అన్నది.

"అంటే... ఆ పిల్లలిద్దరూ మా అమ్మానాన్నలు! వృద్ధాప్యంలో తల్లిదండ్రుల్ని చిన్నపిల్లల్లా చూసుకోవాలంటారు కదండీ..!"

"భలేవారే... నేను నిజంగానే మీకిద్దరు చిన్నపిల్లలనుకున్నాను!"

"అయితే... నేను మీకు పిల్లల తండ్రిలా కనబడుతున్నానా? నేనింకా బ్రహ్మచారినే! నా వయసు ఇరవై ఎనిమిదే!"

"నాకు మాత్రం నలభై ఏళ్ల మధ్యవయస్కుడిలా కనిపిస్తున్నారు!"

"నిజంగా?! మన బ్రాంచిలో లేడీస్టాఫ్ ఎవరూ అలా నాతో అనలేదే..! ఇంకా నేను టీనేజ్ కుర్రాడిలా కనిపిస్తానని అన్నారు!"

"ఎంతైనా... వాళ్ళ సర్వీసుఫైల్స్ మీ చేతిలో ఉన్నాయి. అందువల్ల ఆ భయంతో అలా చెప్పుంటారు!"

"వాళ్ళ పుట్టుమచ్చల వివరాలు కూడా..."

సిగ్గుతో స్వప్న బుగ్గలు కందిపోయాయి. గబగబ లంచ్ కానిచ్చి తన సీటు వద్దకు వెళ్లిపోయింది.

• • •

కృత్తిక రోజు సుబ్రహ్మణ్యస్వామి కొండకి తల్లిదండ్రులతో వెళ్లింది స్వప్న.

రష్ చాలా ఉండటంతో స్పెషల్ టికెట్ కొని వెళ్లారు. గుడిలో పూజారి వేషంలో ఉన్న కిరణ్ని చూసి ఆశ్చర్యపోయింది. నవ్వాపుకుంటూ-

"మీరేమిటి... ఇలా..?" అంది.

"ఈ గుడి పూజారి నా స్నేహితుడు! ఈరోజు కృత్తిక కనుక రష్ ఎక్కువగా ఉంటుందని సహాయానికి పిలిచాడు!" మెల్లగా అన్నాడు. తర్వాత ఆమె తండ్రిపేర అర్చన చేసి ప్రసాదం ఇచ్చాడు.

మరుసటిరోజు బ్యాంకులో కిరణ్ని చూసి ఒకటే నవ్వసాగింది స్వప్న.

"అరెఁ... ఎందుకలా నవ్వుతారు?"

"నిన్న గుడిలో మీ గెటప్ చూసి! అదేదో సినిమాలో హీరో- హీరోయిన్ కోసం పూజారిగా, పోస్ట్మేన్గా, ట్రాఫిక్ పోలీస్గా ఎన్నో వేషాలు వేసుకొని ఆమెకి కనిపిస్తాడు. మీరు కూడా నాకోసం అక్కడ అలా ప్రత్యక్షమయ్యారనుకున్నాను."

"అదేదో అన్న సినిమా ఒకటి ఉన్నట్లు నాకు తెలియదే..?"

"ఈరోజు ప్రొద్దున పాలవాడు, పేపర్వాడు వస్తే మీరే వచ్చారనుకుని పరీక్షగా చూశాను. వాళ్ళిద్దరూ సిగ్గుపడ్డారు పాపం!"

"సోఁ... నేను హీరోనని ఒప్పుకున్నారు!" అంటూ వెళ్లిపోయాడు.

ఒకరోజు కిరణ్ స్వప్న దగ్గరికి వచ్చి "మీ ఫోన్నంబరు ఎంత?" అని అడిగాడు.

"ఎందుకు?"

"బ్రాంచి మేనేజరు అందరి ఫోన్నంబర్లూ కలెక్ట్ చేయమన్నారు. ఎప్పుడైనా అవసరం పడితే బ్రాంచికి పిలిపించడానికి! ఆఫ్కోర్స్... మరీ అవసరమయితేనే అనుకోండి!"

స్వప్న ఫోన్నంబరు చెప్పింది.

"ఈ ఫోను మీ రూములో ఉంటుందా... హాల్లో ఉంటుందా?"

"ఆ విషయం కూడా బ్రాంచి మేనేజరే కనుక్కోమన్నారా?"

"లేదు. ఎవరికైనా ఫోన్ చేయాల్సివస్తే నన్నే చేయమంటారు ఆయన! అప్పుడు మీ నాన్నగారు ఫోను తీసుకున్నారంటే నాకు క్లాసు తీసుకుంటారేమోనని నా భయం!"

"మీకా భయం అఖ్ఖర్లేదు. మా ఫోన్ నా గదిలోనే ఉంటుంది. మా ఇంట్లో నాకోసం వచ్చే కాల్సే ఎక్కువ!"

మరుసటిరోజు అర్థరాత్రి ఫోన్ మ్రోగితే... తీసింది స్వప్న.

"హలో... హాపీ బర్త్‌డే టూ యూ!"

నిద్రమత్తు ఎగిరిపోయింది స్వప్నకి.

'ఎవరు..? ఇంత గుర్తుపెట్టుకొని తనకోసం అర్ధరాత్రి ఫోన్ చేసింది?' అనుకుంది.

"ఎవరు మాట్లాడేది?"

"మీ హీరో!"

"కిరణ్..."

"నేనే... మీ హీరోనని ఒప్పుకున్నారు!"

"కాదు. ఇలాంటి పనులు చేసేది మీరేనని తెలుసు కనుక ఊహించాను!"

"ఏనీవే ఐ విష్ యు ఎ హాపీ డే! బ్యాంకుకి బర్త్‌డే డ్రెస్‌లో వస్తారా?"

"అవును!"

"వద్దండీ... బాగోదు! పోలీసులు స్ట్రీకింగ్ కేసు క్రింద అరెస్టు చేస్తారు!"

"యూ..." అంటూ కోపంగా ఫోన్ పెట్టేసింది.

బ్యాంక్‌లో కొత్తచీరలో ఉన్న స్వప్నను చూసి ఆశ్చర్యపోయాడు కిరణ్. దివి నుంచి భువికి దిగివచ్చిన దేవతలా వుంది స్వప్న!

"సారీ ఫర్ ది నాటీ జోక్!"

"మీరు మేల్కొని ఉన్నారు కనుక తెలివిగా మాట్లాడారు. నిద్రలోవున్న నన్ను లేపి మరీ జోకులేస్తే ఆ శ్లేషలు నాకెలా అర్థమవుతాయి?"

"సారీ అన్నానుగా..! అర్ధరాత్రి వరకు మేల్కొని బర్త్‌డే విషెస్ చెప్పినందుకు థాంక్స్ కూడా చెప్పలేదు మీరు!" చిరుకోపంగా అన్నాడు.

"థాంక్యూ వెరీమచ్..!"

"ఒట్టి థాంక్సేనా? ఇంకేమీ లేవా..?"

"ఇంకేవీ అంటే..?"

"ఏదైనా... స్వీట్‌గా..." నవ్వుతూ అన్నాడు.

"మీరు సంస్కారవంతులనుకున్నాను. ఇలా మాట్లాడతారని అనుకోలేదు!" కోపంగా అంది.

"నేను నిజంగా స్వీటే అడిగాను. మీరే ఏవేవో ఊహించుకొని అపార్థం చేసుకున్నారు."

స్వప్న మాట్లాడలేదు. కిరణ్ వెళ్ళిపోయాడు.

తర్వాత వారంరోజులు ఇద్దరూ మాట్లాడుకోలేదు.

ఒకరోజు స్వప్న ప్రక్కకౌంటర్‌లోని వ్యక్తి లీవు పెట్టడంతో– కిరణ్‌ని ఆ సీట్లో వేశారు.

కిరణ్ తన చేతిలోని ఫోటోని తదేకంగా చూస్తుంటే ఆగలేక అడిగింది– ఆ ఫోటో ఎవరిదని.

"ఓ పెళ్ళికాని యువకుడి చేతిలో అమ్మాయి ఫోటో ఉంటే... ఏమిటి దానర్థం?"

"ఆ అమ్మాయి అతని ప్రియురాలైనా అయివుండాలి, లేదా– అతని కోసం వచ్చిన సంబంధం తాలూకు పెళ్ళికూతురైనా అయివుండాలి!"

"మీ రెండో గెస్ కరెక్ట్! అమ్మాయి ఎలావుంది?" ఫోటో ఆమెకిస్తూ అడిగాడు.

ఫోటో చేతిలోకి తీసుకుని చూసింది స్వప్న.

ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది. ఫోటో వెనుక 'మాధురి' అని క్రింద ఫోన్‌నంబరు రాసి వుంది. అప్రయత్నంగా ఆ ఫోన్ నంబరు గుర్తుపెట్టుకుంది.

ఫోటో అతనికిచ్చేస్తూ- "చాలాబాగుంది!" అంది.

అలా అంటున్నప్పుడు ఆమె కంట్లో నీరు తిరిగింది.

"అదేమిటి... ఏడుస్తున్నారా?"

"లేదు. మీ ఇద్దర్నీ జోడీగా ఊహించుకుంటే వచ్చిన ఆనంద బాష్పాలివి!"

"మా అమ్మో, బామ్మో చెప్పవలసిన డైలాగ్ ఇది!"

"ఇంతకీ... ఎప్పుడు పెళ్ళి?"

"ఇంకా పెళ్ళిచూపులే కాలేదు."

"పోనీ... ఎప్పుడు పెళ్ళిచూపులు?"

"వచ్చే శుక్రవారం!"

"ఆల్ ది బెస్ట్!"

"థాంక్యూ!" అంటూ ఫోటో చూడ్డంలో మునిగిపోయాడు.

బాధగా తను సీటు వైపు నడిచింది.

ఆరోజంతా స్వప్న మనసు అలజడితో నిండిపోయింది.

రాత్రి ఇక ఉండలేక మాధురికి ఫోన్ చేసింది.

"హలో... మాధురి ఉన్నారా?"

"నేనే మాధురిని! మీరెవరు?"

"నా పేరు స్వప్న! మీ పెళ్ళిచూపులకి వస్తున్న కిరణ్‌ని మనసారా ప్రేమించాను. కిరణ్‌కీ నేనంటే ఇష్టమే! ప్లీజ్... నాకోసం ఈ సంబంధాన్ని తిరస్కరించరూ?"

"ఓ.కే... కాని, కిరణ్ మిమ్మల్ని ప్రేమించి ఉంటే అసలు పెళ్ళిచూపులకే ఒప్పుకునేవాడు కాదుకదా..?"

"నిజమే! కాని, నేనింకా అతనికి నా ప్రేమవిషయం చెప్పలేదు!"

"భలేవారే..! ఏమీ లేకుండా నాకెందుకు ఫోన్ చేశారు? ఒకవేళ నేను అతన్ని తిరస్కరించి, మిమ్మల్ని అతను తిరస్కరించి, చివరకు ఎవరో మూడో అమ్మాయి అతన్ని ఎగరేసుకుపోతే..?"

"ఒక పని చేద్దాం! నేను శుక్రవారం లోపల అతనికి నా ప్రేమవిషయం చెపుతాను. అతను నన్ను కాదంటే మీరు ఏ సంకోచం లేకుండా అతన్ని పెళ్ళి చేసుకోవచ్చు!" ఆ మాట అంటున్నప్పుడు ఆమెకి ఏడుపు వచ్చేసింది.

సోc... తను నిజంగానే కిరణ్‌ని ప్రేమిస్తోంది!

అతను లేకుండా తను బ్రతకలేదు. మరి ఎందుకు తను ఆ విషయం అతనితో చెప్పలేకపోతోంది? అతని టీజింగ్ నేచర్ వల్ల కావచ్చు. రేపు మాత్రం అతనితో ఎలాగయినా చెప్పేయాలి.

మరుసటిరోజు కిరణ్‌తో "కిరణ్‌గారూ..! నామీద మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగింది.

"సదభిప్రాయమే! అందం ఉంది, మంచి ఉద్యోగం ఉంది, తెలివితేటలున్నాయి. మంచి వర్కర్, క్రమశిక్షణలో పెరిగారు. ఈకాలపు కొంతమంది అమ్మాయిల్లాగా 'ప్రేమా, దోమా' అంటూ పిచ్చివేషాలు వేసే రకం కాదు మీరు!"

అతని మాటలు ఆమెని ఇంకేమీ మాట్లాడనివ్వకుండా చేశాయి.

"అయినా... ఎందుకు నా అభిప్రాయం అడిగారు?" కిరణ్ అడిగాడు.

"ఒకసారయినా నిజం చెప్పకపోతారా అని..!"

"నిజమే... ఇప్పుడు కూడా నిజం చెప్పలేకపోయాను... సారీ!"

కోపంగా అతని వైపు చూసింది. అతనక్కడ లేడు.

• • •

సోమవారం స్వప్నకి మాధురి ఫోన్ చేసింది.

"మీ ప్రేమవిషయం కిరణ్‌కు చెప్పారా?"

"ఇంకా లేదు."

"ఇంకా ఎందుకాలస్యం? ఇంతకీ... కిరణ్ ఎటువంటివాడు?"

"చాలా మంచివాడు, అందగాడు, ఎటువంటి దురలవాట్లూ లేనివాడు! మా బ్రాంచిలో అందరికీ అతనంటే ఇష్టం! ఆడవాళ్ళతో చాలా మర్యాదగా ఉంటాడు. ఒక్క నన్నే ఎప్పుడూ ఉడికిస్తూ ఉంటాడు. అయినా... ఐ లవ్ హిమ్!"

"మీరు అతని గురించి చెప్తూంటే నాకేమనిపిస్తోందో తెలుసా? మీకంటే ముందే అతనితో 'ఐ లవ్ యు' అని చెప్పి నా సొంతం చేసుకోవాలనిపిస్తుంది- 'మీరు స్వార్థపరురాలు' అని అన్నా సరే!"

"వద్దు వద్దు... అంత పని చేయకండి! ఈరోజు స్టాఫ్ అందరం మా కొలీగ్ పెళ్ళికి తిరుమల వెళ్తున్నాం. మళ్ళీ రేపు ఉదయాన్నే ముహూర్తం చూసుకొని వచ్చేస్తాం! ఈ ట్రిప్‌లో వీలుచూసుకుని అడిగేస్తాను!"

"ఓ.కే... ఆల్ ద బెస్ట్!"

• • •

రెండు టాటాసుమోలు మాట్లాడుకొని స్టాఫంతా తిరుమలకు బయలుదేరారు.

తిరుమల చేరగానే ముందు దైవదర్శనానికి టికెట్లు కొన్నారు. క్యూలో కిరణ్ ప్రక్కనే మాట్లాడుతూ నడుస్తున్నా పెళ్ళివిషయం మాట్లాడే అవకాశం మాత్రం దొరకలేదు. కాని, కిరణ్‌తో స్వామివారిని దర్శించిన అనుభవం ఆమెకి ధైర్యాన్నీ, నమ్మకాన్నీ ఇచ్చాయి. దర్శనమయ్యాక కాసేపు అందరూ ఆలయం బయట కూర్చున్నారు.

బ్రాంచి మేనేజర్ అందరి నుద్దేశించి ఇలా అన్నాడు-

"రేపు ప్రొద్దున రవికి పెళ్ళయిపోతే... ఇక మన బ్రాంచిలో కిరణ్ ఒక్కడే బ్రహ్మచారిగా మిగుల్తాడు. నేను మీ బ్రాంచికి రిపోర్ట్ చేసిన క్రొత్తలో కిరణ్ నన్నెంతగానో ఆకట్టుకున్నాడు. అతని సిన్సియారిటీ, పంక్చువాలిటీ, ఉత్సాహం అతనిలో నాకు నచ్చిన అంశాలు. ఒకరోజు

అతని ఆదాయం, ఖర్చుల వివరాలు అడిగి కనుక్కొని, అతనికి ఫైనాన్షియల్ డిసిప్లిన్ నేర్పించాను. హౌసింగ్ లోన్ తీసుకోమని ప్రోత్సహించి ఇల్లు కట్టించాను, కారు కొనిపించాను. స్వప్న మన బ్రాంచికి వచ్చిన తరువాత నేను కిరణ్‌ని స్వప్నను పెళ్ళి చేసుకోమని, భార్యాభర్తలిద్దరూ సంపాదనాపరులైతే ఆర్థికంగా ఏ బాధలూ ఉండవని చెప్పాను. పైగా- అందంలో, చురుకుదనంలో స్వప్న కిరణ్‌కి సరిజోడి! నేను ఇచ్చిన ప్రతి సలహా పాటించినట్లే- కిరణ్ ఈ సలహా కూడా పాటించాడు. స్వప్నని మనసారా ప్రేమించాడు. సో... ఫ్రెండ్స్! త్వరలోనే వాళ్ళిద్దరూ మనకి పెళ్ళి విందు ఇస్తారు."

అందరూ చప్పట్లు కొట్టి స్వప్ననీ, కిరణ్‌నీ అభినందించసాగారు.

స్వప్నకి తను విన్నది కలో, నిజమో అర్థంకాలేదు. తాను కోరుకున్నది, అడగాలనుకున్నది నిజమయ్యేసరికి- ఆనందంతో మనసు నిండిపోగా... అందరి అభినందనల్ని స్వీకరించింది. తర్వాత అందరూ తమకై రిజర్వ్ చేయబడిన కాటేజెస్‌కి వెళ్లారు.

మరునాడు తెల్లవారుఝామునే ముహూర్తం ఉండటంతో- అందరూ త్వరగా నిద్రలోకి జారుకున్నారు. స్వప్నకి ఎక్సైట్‌మెంట్‌తో నిద్రరాక బయటకి వచ్చింది.

దూరంగా లాన్‌లో సిమెంట్ బెంచీపై ఒంటరిగా కూర్చునివున్న కిరణ్‌ని చూసింది.

లాల్చీ, పైజమాతో అందంగా, హుందాగా ఉన్నాడతను.

అతని ప్రక్కనే కూర్చుంటూ "నిద్రరావడం లేదా..?" అని అడిగింది.

"నిద్ర రోజూ వస్తుంది. ఇటువంటి ప్రశాంతమయిన, పవిత్రమయిన వాతావరణం రోజూ చూడంగా..! అందుకే కాసేపు నిద్ర వాయిదా వేశాను!" అన్నాడు.

తర్వాత తనే "కంగ్రాచ్యులేషన్స్..! నాలాంటివాణ్ణి భర్తగా పొందబోతున్నందుకు!"అన్నాడు.

"అయినా నా అభిప్రాయం తెలుసుకోకుండా మీరూ, మీ మేనేజరూ అలా అందరిముందు అనౌన్స్ చేయడం నాకు నచ్చలేదు!"

"అంటే... నన్ను చేసుకోవడం మీకిష్టం లేదా?"

"ఇష్టం ఉంది. అయినా... ముందు నన్నొక్కసారి అడగడం మీ ధర్మం!"

"మీ అభిప్రాయం కూడా తెలుసుకున్నాకే అడగడం, అనౌన్స్ చేయడం జరిగింది!"

"ఆహాఁ... ఆకాశవాణి చెప్పిందా?" వెటకారంగా అంది.

"కాదు... దూరవాణి!"

"అంటే..?"

"అంటే... దూరవాణిలో మీరు మాధురికి చెప్పారు!"

"ఆ విషయం మీకెలా తెలుసు..? మాధురి చెప్పిందా?" ఆశ్చర్యంగా అడిగింది.

"పిచ్చి స్వప్నా! మాధురి ఎవరనుకుంటున్నారు? మా వదిన! మిమ్మల్ని చేసుకోమని నన్ను ప్రోత్సహించిన రెండవ వ్యక్తి ఆవిడ! మీరు ఆ ఫోన్‌నంబరు మన స్టాఫ్‌కెవరికైనా చూపించి ఉంటే అది మా ఇంటి ఫోన్‌నంబరని మీకు తెలిసిపోయి ఉండేది!"

"యూ..." అంటూ అతని వైపు కోపంగా చూసి, వెంటనే నవ్వేసింది సంతోషంగా.